'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కొలువుదీరిన కొత్త సభ

ఎన్నికల తంతు పూర్తయి కొత్త పార్లమెంట్ కొలువుదీరింది. ముచ్చటగా మూడో విడత ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరినప్పటికీ బలాబలాల్లో ప్రస్ఫుటమైన తేడాలు రావడం మనం చూస్తున్నాం. పాలక కూటమి బలం, పలుకుబడి ఒకింత తగ్గడం, విపక్ష కూటమి కొంత ముందంజ సాధించడం అనేవి సభా నిర్వహణలో తప్పక ప్రతిఫలిస్తాయి. తొలిరోజు సంరంభంలో రాజ్యాంగం, ఎమర్జెన్సీ పదేపదే ప్రస్తావనకు రావడం ఆహ్వానించదగ్గ విషయమే. దీనిపై పాలక, విపక్షాల మధ్య కొంత రాద్ధాంతమూ చోటుచేసుకుంది. దేశం ప్రకటిత, అప్రకటిత ఎమర్జెన్సీలను ఎంతమాత్రం కోరుకోవడం లేదనేది విస్పష్టం. నాడు ఇందిర పాలనపై, నిన్నటి ఎన్నికల్లో మోదీ ప్రభుత్వంపై ప్రజలు ఇచ్చిన తీర్పులే అందుకు నిదర్శనాలు. పాలక, విపక్ష కూటములకు నాయకత్వం వహిస్తున్న రెండు జాతీయ పార్టీలూ ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని మసలుకుంటే మంచిది.

అభివృద్ధి, సంక్షేమాల మధ్య సమతూకం సాధించి సమస్యల వలయం నుంచి ప్రజలను బయటపడేయటం తక్షణ కర్తవ్యం. ఆ దిశగా పార్లమెంటు చర్చలు సాగాల్సి ఉంది. ఎన్నికల ప్రచారార్భాటంలో పెద్దగా ప్రస్తావనకు రాని ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయన్న సంగతి ఈ సందర్భంగా మరచిపోరాదు. విపక్షం బలపడటం వల్ల ఈ సమస్యలపై సభలో అర్థవంతమైన చర్చలు జరిగి, తగిన కార్యప్రణాళిక రూపొందుతుందని దేశ ప్రజలు ఆశిస్తున్నారు. వ్యవసాయ రంగం కనీస మద్దతు ధర కోసం, పారిశ్రామిక రంగం ప్రోత్సాహకాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఆదాయాల్లో పెరుగుతున్న వ్యత్యాసాల దృష్ట్యా పేదరిక నిర్మూలనకు వినూత్నమైన విధానాలను రూపొందించడం తప్పనిసరి. నిర్లక్ష్యానికి గురై నీరసించిన నిరుద్యోగులకు తక్షణం ఎంతో కొంత ఊరట కల్పించాల్సిన బాధ్యత కూడా ప్రజలెన్నుకున్న ప్రతినిధులపై ఉన్నది.

మారిన పరిస్థితుల్లో ప్రభుత్వం ఒంటెత్తు పోకడలకు పోకుండా నలుగురినీ కలుపుకొనిపోయే రీతిలో పనిచేయడం ఎంత ముఖ్యమో.. ఇండియా కూటమి నిర్మాణాత్మక ప్రతిపక్ష బాధ్యతను సమర్థంగా నిర్వహించడమూ అంతే ముఖ్యం. కానీ, ఈ సయోధ్య అంత సులభంగా సాధ్యం కాదని స్పీకర్ ఎన్నిక వివాదం తెలియజేస్తున్నది. సభాపతిని ఏకగ్రీవంగా ఎన్నుకునే సంప్రదాయానికి దశాబ్దాల తర్వాత గండి పడుతున్నది. బలం పెంచుకున్న విపక్షం డిప్యూటీ స్పీకర్ పదవి కోసం పట్టుబట్టడం, పాలక పక్షం ససేమిరా అనడంతో పోటీ అనివార్యమవుతున్నది. రాబోయే రోజుల్లో జరగబోయే సభావ్యవహారాల తీరుతెన్నులను ఇది సూచనప్రాయంగా వెల్లడిస్తున్నది. ఏదేమైనప్పటికీ పాలకపక్షం, విపక్షం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వెళ్లాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పక తప్పదు. అప్పుడే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం సార్థకమవుతుంది.

దేశంలో ఎమర్జెన్సీ!

దేశంలో అనేక రంగాల్లో ఎమర్జెన్సీ పరిస్థితులు కనిపిస్తున్నాయి. మణిపూర్‌లో పర్వడిన ఎమర్జెన్సీపై బీజేపీ ఎప్పుడు మాట్లాడుతుంది? విద్యా వ్యవస్థలో ఎమర్జెన్సీపై కమలం పార్టీ ఎప్పుడు మాట్లాడుతుంది? వ్యవసాయ రంగంలో ఎమర్జెన్సీపై ఎప్పుడు మాట్లాడుతుంది? కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గతాన్ని తవ్వే ముందు వీటికి సమాధానాలు చెప్పాలి.

- క్లాయిడ్ క్రాస్టో, ఎన్సీపీ (ఎస్పీ) అధికార ప్రతినిధి

ఏది న్యాయ విచారణ సంఘం?

ఎడిటోరియల్ డెస్క్

తెలంగాణలో గత పదేండ్ల కాలంలో జరిగిన విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, కొత్త థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణంపై విచారణ జరిపేందుకు గత మార్చి 14న రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి నేతృత్వంలో ఏకసభ్య విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే, ఈ కమిషన్ విచారణ తీరును వ్యతిరేకిస్తూ మాజీ సీఎం కేసీఆర్ 12 పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. ఈ లేఖపై కాంగ్రెస్ నాయకులు భట్టి విక్రమార్క, నిరంజన్ తదితరులు అంతెత్తున లేచారు. ఈ విషయంపై హైకోర్టు జోక్యం చేసుకోవాలని, కోర్టు ధిక్కారం కింద పరిగణించాలని నానా హడావుడి చేశారు. దీంతో రేవంత్ సర్కారు ఏర్పాటు చేసిన కమిషన్ ఏమిటి? అసలు అది న్యాయ విచారణ కమిషనా? లేక కేవలం విచారణ సంఘమా? దాని పరిమితులు ఏమిటి? కోర్టు ధిక్కారమనే ప్రస్తావన ఇందులో ఎందుకు వచ్చింది? అనే పలు ప్రశ్నలు సామాన్యుల నుంచి మేధావుల వరకూ అందరినీ తొలిచివేస్తున్నాయి. దీనిపై లోతుల్లోకి వెళ్తే.. రేవంత్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది విచారణ సంఘం మాత్రమేనని, న్యాయ విచారణ కమిషన్ కాదని అర్థమవుతున్నది. దేశంలోని పలు హైకోర్టులు, సుప్రీంకోర్టు జడ్జిలు, న్యాయ స్థానాల తీర్పులు ఈ విషయాన్ని సుస్పష్టం చేస్తున్నాయి కూడా.

హైకోర్టు కుదరదని చెప్పడంతో..

కేసీఆర్ హయంలో జరిగిన పనులకు సంబంధించి అటు విద్యుత్తు కొనుగోళ్ల మీద జస్టిస్ నర్సింహారెడ్డి విచారణ కమిషన్‌ను, ఇటు కాళేశ్వరం మీద జస్టిస్ ఘోష్ విచారణ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, అంతకు ముందే విద్యుత్తు కొనుగోళ్లు, కాళేశ్వరం ప్రాజెక్టుపై సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటు చేస్తామంటూ రేవంత్ సర్కారు పేర్కొంది. ఇదే విషయమై హైకోర్టును ఆశ్రయించింది. అయితే, సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం.. సిట్టింగ్ జడ్జిని ఇవ్వడం కుదరదని ఉన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. దీంతో చేసేదేమీలేక.. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్-1952 ప్రకారం.. రేవంత్ సర్కారు రిటైర్డ్ జడ్జిలతో విచారణ సంఘాలను ఏర్పాటు చేయవలసి వచ్చింది.

న్యాయ విచారణ కమిషన్ల ఏర్పాటుపై సుప్రీంకోర్టు ఏం చెప్పింది?

సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటుకు సంబంధించి టీ ఫెన్ వాల్తేర్ అండ్ అదర్స్ వర్సెస్ కేంద్రప్రభుత్వం అండ్ అదర్స్ కేసులో సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్-1952 ప్రకారం.. న్యాయ విచారణ కమిషన్‌కు సిట్టింగ్ జడ్జి నేతృత్వం వహించవచ్చు. అయితే ఈ నియామకంతో ఇతర న్యాయపరమైన (కోర్టు) పనులకు ఎలాంటి ఆటంకాలు జరుగకూడదని సుప్రీం వెల్లడించింది. అలాగే, కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండకూడదు. విచారణ సమయంలో సిట్టింగ్ జడ్జి పదవికి గౌరవ భంగం కలుగకూడదు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడేలా విచారణ ఉండాలి. ముఖ్యంగా జాతి ప్రయోజనాలకు, తీవ్రమైన అంశాలకు సంబంధించిన కేసుల విషయంలోనే న్యాయ విచారణ కమిషన్ల ఏర్పాటు జరగాలంటూ సుప్రీంకోర్టు పలు మార్గదర్శకాలను విడుదల చేసింది. ఒకవిధంగా విచారణ కమిషన్లకు సిట్టింగ్ జడ్జిలను ఇవ్వడం కుదరదంటూ పరోక్షంగా ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో తర్వాతి కాలాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు రిటైర్డ్ న్యాయమూర్తులతో విచారణ కమిటీలను ఏర్పాటు చేయడం మొదలుపెట్టాయి. అలా అనేక విచారణ కమిటీలు ఏర్పాటయ్యాయి.

న్యాయ విచారణ కమిషన్.. విచారణ సంఘం మధ్య తేడా ఏమిటంటే?

కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్-1952 ప్రకారం ఏర్పాటైన కమిటీకి పదవీ విరమణ చేసిన న్యాయమూర్తిని నియమిస్తే అది న్యాయ విచారణ అనుకొంటే పొరపాటే. న్యాయ విచారణ కమిషన్‌కు, విచారణ సంఘానికి చాలా తేడాలు ఉన్నాయి. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్-1952 ప్రకారం ఏర్పాటైన ప్రతీ కమిషన్ న్యాయ విచారణ కమిషన్ కాదు. సాధారణ విచారణ సంఘం కూడా కావొచ్చు.

కోర్టు ధిక్కారం ఎలా అవుతుంది?

1958లో శ్రీరామకృష్ణ ధాల్మియా వర్సెస్ జస్టిస్ ఎస్ఆర్ టెండూల్కర్, కేంద్ర ప్రభుత్వం కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. విచారణ సంఘాన్ని.. న్యాయ విచారణ కమిషన్‌గా పరిగణించలేమని కోర్టు ఆ సందర్భంగా తేల్చిచెప్పింది. కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ.. ఆ కమిషన్‌కు న్యాయపరమైన అధికారాలు ఉండబోవని గుర్తు చేసింది. కమిటీ విచారణ తీరుపై న్యాయ సమీక్ష చేసే అధికారం ఉంటుందని తెలిపింది. అలాగే, సివిల్ లేదా క్రిమినల్ కేసులకు సంబంధించి భవిష్యత్తులో ఏదైనా విచారణకు సాక్ష్యంగా ఈ కమిటీ నివేదికను పరిగణించడానికి వీల్లేదని గుర్తు చేసింది. పరిహారం చెల్లించాలని, జరిమానా విధించాలని లేదా ఫలానా శిక్ష విధించాలనే పరిధి ఈ కమిటీకి ఉండబోదని.. ఆ అధికారం పూర్తిగా కోర్టులదేనని తెలిపింది. న్యాయస్థానం ముందు విచారణ కమిటీ అసలు ప్రత్యామ్నాయం కానేకాదని తేల్చిచెప్పింది. ప్రభుత్వం లేదా చట్టసభల అభీష్టం మేరకు ఏర్పాటైన కమిషన్ ఇచ్చే నివేదిక కోర్టు తీర్పు కాబోదు. ఒక వేళ దానిని తీర్పుగా భావిస్తే, హైకోర్టు, సుప్రీంకోర్టుల పాత్రలను ప్రభుత్వం, చట్టసభలే పోషించినట్లు అవుతుంది. న్యాయ ప్రక్రియలో శాసన వ్యవస్థ పూర్తిగా చొరబడినట్లు అవుతుంది. కమిషన్ నియామక అధికారం ద్వారా ప్రభుత్వం తమకు లేని న్యాయపరమైన అధికారాలను కల్పించుకుందనే వాదన కూడా ఉంది. కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడమంటే న్యాయ విచారణాధికారాలను చేపట్టినట్లు కాదని, దాని అధికారం శాసన, పరిపాలనా వ్యవహారాలకే పరిమితమని చెప్పడం జరిగింది. రేవంత్ సర్కారు ఏర్పాటు చేసిన కమిషన్ కూడా ఇలాంటిదే. అలాంటి కమిషన్ విచారణ తీరును వ్యతిరేకించడం కోర్టు ధిక్కారంగా కాంగ్రెస్ నేతలు అభివర్ణించడం సమంజసంగా లేదు.

విచారణ సంఘం ఇలా..

విచారణ సంఘాన్ని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తాయి. ఈ కమిటీకి హైకోర్టు లేదా సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి నేతృత్వం వహిస్తారు. రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వం వహించడంతో ఇది న్యాయ విచారణ కమిషన్ అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే, ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కమిషన్లు న్యాయ విచారణ కమిషన్లు కాబోవని, అవి న్యాయపరమైన ప్రక్రియను పూర్తి చేయబోవని 66 ఏండ్ల కిందటే దేశ అత్యున్నత ధర్మాసనం సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం తీర్పు చెప్పింది. ఇలాంటి కమిటీలు ఇచ్చే నివేదికలకు లీగల్‌గా బైండింగ్ ఉండబోదు. ఈ కమిటీలు తీర్పులు ఇవ్వలేవు. ప్రభుత్వానికి సిఫారసులు మాత్రమే చేయగలవు. ఆ సిఫారసులను ప్రభుత్వం పరిగణించవచ్చు, లేదా పక్కన పెట్టవచ్చు కూడా. నివేదికలోని అంశాలను భవిష్యత్తులో సాక్ష్యాలుగా కూడా పరిగణించడానికి వీలులేదు. ఎలాంటి శిక్షలను సూచించే పరిధి ఈ కమిటీలకు ఉండదు. స్వాతంత్ర్యానంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ఇలాంటి కమిటీలు ఇచ్చిన నివేదికలను తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు బుట్టదాఖలు చేసిన ఘటనలు కోకొల్లలు. ఇక, ఈ కమిటీలు ఇచ్చిన నివేదికలపై అభ్యంతరాలు ఉంటే కోర్టులకు వెళ్లే వీలు కూడా ఉన్నది.

న్యాయ విచారణ కమిషన్ ఇలా..

హైకోర్టులు లేదా సుప్రీంకోర్టు ఏదైనా అంశంపై విచారణ చేసేందుకు న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తే, ఆ కమిషన్‌కు ఆయా కోర్టుల అధికారాలు కూడా ఉంటాయి. సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ఈ కమిషన్లు ఏర్పాటవుతాయి. న్యాయ విచారణ కమిషన్ విచారణ పూర్తిగా కోర్టుల మాదిరిగానే ఉంటుంది. తమ ముందుకొచ్చిన కేసులోని వాదప్రతివాదులకు నోటీసులు జారీ చేయడం, ఇరుపక్షాల వాదనలు వినడం, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించడం.. ఇవన్నీ చేశాకే నివేదిక తుదిరూపునకు వస్తుంది. న్యాయ కమిషన్ ఇచ్చే నివేదికపై ఆయా కోర్టులకు వాదప్రతివాదులు, సాక్షులు, కక్షిదారులు జవాబుదారీగా ఉండాలి. న్యాయ విచారణ కమిషన్ ఇచ్చిన నివేదికను ఆయా కోర్టులు ఆమోదిస్తే.. ఆ కోర్టు తీర్పు వెలువరించినట్లే అవుతుంది. న్యాయ విచారణ కమిషన్ ఇచ్చే నివేదికకు లీగల్ బైండింగ్ ఉంటుంది. నివేదికలోని అంశాలు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చే తీర్పుతో సమానం. కమిషన్ ఇచ్చే నివేదికలను కోర్టులు ప్రామాణికంగా తీసుకుంటాయి. భవిష్యత్తులో సాక్ష్యాలుగానూ పరిగణిస్తారు. శిక్షలను సూచించే అధికార పరిధి కూడా ఈ కమిషన్లకు ఉంటుంది.

పై విషయాలన్నింటినీ క్షుణ్ణంగా విశ్లేషిస్తే.. రేవంత్ సర్కారు ఏర్పాటు చేసిన ఈ కమిటీలు న్యాయ విచారణ కమిషన్లు కావనేది స్పష్టమవుతున్నది. ఇవి కేవలం విచారణ సంఘాలే. వీటికి ఎటువంటి లీగలిటీ అనేది లేదు. రిటైర్డ్ న్యాయమూర్తుల నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిటీలు సాక్షుల వాంగ్మూలాలను రికార్డు చేస్తాయే తప్ప.. ఏది న్యాయమో? ఏది అన్యాయమో? విచారణ చేసి తీర్పులు చెప్పే అధికారం వీటికి ఉండదు. ఇలాంటి కమిటీలు ఇచ్చే నివేదికను రాజ్యాంగ ధర్మాసనం (హైకోర్టులు లేదా సుప్రీంకోర్టు) ఇచ్చే తీర్పుతో సమానంగా చూడలేం. అలాగే, తాము సూచించే సిఫారసులను అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఈ కమిటీలు కనీసం ఆదేశించనూలేవు. మరి, కోర్టులు గతంలో న్యాయ విచారణ కమిషన్లను ఏర్పాటు చేయలేదా? అంటే.. చేశాయి కూడా. అయితే, నేరారోపణలు తీవ్రమైన ఘటనల్లో మాత్రమే సాధారణంగా న్యాయ విచారణ కమిషన్లను కోర్టులు ఏర్పాటు చేస్తాయి. ఉదాహరణకు.. 1985 జూలై 17న కారంచేడులో జరిగిన మారణకాండ కేసు విచారణ కోసం ఏర్పాటు చేసిన కమిషన్.. జ్యుడీషియల్ ఎంక్వైరీ కమిషనే. ఈ కమిషన్ నివేదికను ఆధారంగా చేసుకొనే సుప్రీంకోర్టు తుది తీర్పు వెలువరించింది. న్యాయ విచారణ కమిషన్ల నివేదికలకు కోర్టుల్లో విలువ ఉంటుంది. ఒకవిధంగా ఆ నివేదికలు కోర్టు తీర్పుల్లాంటివే.

అయితే, ఇవేమీ పట్టించుకోని రేవంత్ సర్కారు ఇప్పుడు విచారణ సంఘాన్ని ఏర్పాటు చేసింది. అంటే ఇది ఒక విధంగా సివిల్ కోర్టు తీర్పుపై (ఎస్ఈఆర్‌సీ ఆమోదించిన నిర్ణయంపై) సర్కారు విచారణకు ఆదేశించడమే అవుతుంది. హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించిన జస్టిస్ నర్సింహారెడ్డికి ఈ విషయాలు తెలియదనుకోవడానికి లేదు. ఆయనైనా ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలకు తెలియజేస్తే బాగుండేది. అయితే, అలా జరగలేదు. అంతే కాదు.. విచారణ పూర్తికాకుండానే మీడియా సమావేశం నిర్వహించడం కూడా నిబంధనల ఉల్లంఘన కిందికే వస్తుందని నిపుణులు అంటున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే జస్టిస్ నర్సింహారెడ్డి కమిటీ.. కేసీఆర్ పాలనలోని గత సర్కారుపై దురుద్దేశపూర్వకంగా వ్యవహరిస్తున్నదని స్పష్టమవుతున్నది.

రెండు కమిషన్ల మధ్య తేడాలు సమగ్రంగా..

న్యాయ విచారణ కమిషన్	విచారణ సంఘం
వీటిని న్యాయస్థానాలు ఏర్పాటు చేస్తాయి.	కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తాయి.
సాధారణంగా సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో విచారణ జరుగుతుంది.	రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో విచారణ సాగుతుంది.
లీగల్ బైండింగ్ ఉంటుంది.	లీగల్ బైండింగ్ ఉండదు.
నివేదికలోని అంశాలు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చే తీర్పుతో సమానం.	తీర్పులు ఇవ్వలేవు. ప్రభుత్వానికి సిఫారసులు మాత్రమే చేయగలవు.
ఈ నివేదికలోని అంశాలను కోర్టులు ప్రామాణికంగా తీసుకుంటాయి.	ఈ నివేదికలను ప్రభుత్వాలు అంగీకరించవచ్చు. లేదా బుట్టదాఖలు చేయవచ్చు.
నివేదికలోని అంశాలను భవిష్యత్తులో సాక్ష్యాలుగా పరిగణించగలం.	నివేదికలోని అంశాలను భవిష్యత్తులో సాక్ష్యాలుగా పరిగణించలేం.
పరిహారం, జరిమానా, శిక్షలను సూచించే పరిధి ఉన్నది.	ఎలాంటి శిక్షలను సూచించే పరిధి లేదు.

బీఆర్ఎస్‌పై బ్లేమ్ ఓ మైండ్‌గేమ్!

నేడు ఎమ్మెల్యేలు, నాయకులు కొందరు బీఆర్ఎస్ పార్టీని వీడుతున్న క్రమంలో కొన్ని సోకాల్డ్ మీడియా సంస్థలు బీఆర్ఎస్ పనైపోయిందనే పైశాచికానందాన్ని పొందుతున్నాయి. ఇక బీఆర్ఎస్ పైకి లేవదు, ఆ పార్టీలో కేసీఆర్ ఒక్కరే మిగులుతారని వింతగా మాట్లాడుతున్నాయి. నిజానికి ఇదొక పెద్ద మైండ్ గేమ్.

తెలంగాణ విజయ్
94919 98702

బీఆర్ఎస్, కేసీఆర్ పనైపోయిందనుకొని సంబురపడ్డ ప్రతీసారి ఆ అనుకున్నవాళ్లే పతా లేకుండాపోయారు. కేసీఆర్ మాత్రం కిందపడ్డ ప్రతీసారి రెట్టించిన వేగంతో ఉవ్వెత్తున పైకి లేశారు. తెలంగాణ ఉద్యమం మొదలుపెట్టిన తొలినాళ్లల్లో కూడా ఇవే మాటలు. 'ఈ బక్కమనిషితో తెలంగాణ వస్తదా, అసలు టీఆర్ఎస్ ఉంటదా, ఈయన తెలంగాణ తెస్తడా' అని హేళన చేసిర్రు. తొలి అడుగులోనే టీఆర్ఎస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించి విమర్శకుల నోళ్లు మూయించింది. ఉద్యమ ప్రస్థానంలో వైఎస్సార్ ఆపరేషన్ ఆకర్ష్ మొదలుపెట్టి టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లాక్కుంటే వచ్చిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ ఒకేసారి కిందపడింది. ఆ దశలో కూడా టీఆర్ఎస్ పనైపోయిందనుకున్నారంతా. కానీ తన వ్యూహాలతో రెట్టింపు వేగంతో టీఆర్ఎస్ మళ్లీ పైకి లేచింది. గండర గండడు కేసీఆర్. అతను తలచుకుంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించగలరు. రాదనుకున్న తెలంగాణను, సాధించి చూపెట్టిన ఘనత కేసీఆర్‌కు దక్కింది.

ఒక్క ఓటమితో కేసీఆర్ పనైపోయిందనుకోవటం మూర్ఖత్వం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది కేవలం 2 శాతం ఓట్ల తేడాతోనే. పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పాలన పట్ల అవగాహన లేని నాయకులు ఆ పార్టీకి నేతృత్వం వహిస్తున్నందువల్ల ప్రజల నుంచి చీదరింపులను, ఛీత్కారాలను ఎదుర్కొంటున్నది. వారి పుణ్యమాని కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వమనే ముద్ర తెచ్చుకున్నది. సంక్షేమ పథకాల అమలు సరిగా కావడం లేదు. ప్రీ బస్‌తో అబాసుపాలైంది. రైతుబంధు వేయటంలో విఫలమైంది.

తప్పులు మీద తప్పులు చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రజల దృష్టి మరల్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకున్నది. కేసీఆర్ అవినీతి చేశారంటూనే విచారణ అంటూ కమిషన్ల పేరిట కాలయాపన చేస్తున్నది. కరెంట్ విషయంలో కేసీఆర్ స్కాం చేశారంటూ అబద్ధపు ప్రచారాలను ముందరేసుకున్నది. మచ్చలేని హరీశ్‌రావుపైనా అపనిందలు వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు శునకానందం పొందుతున్నారు. ఇదంతా ఒక డైవర్షన్ గేమ్.

రాష్ట్రంలో అధికారం లేదు కదా అని ప్రజలు బీజేపీకి కొంత డైవర్టయ్యారు తప్పితే తెలంగాణ ప్రజల్లో కాంగ్రెస్ పట్ల పెద్దగా విశ్వసనీయత లేదనే విషయం ఇప్పటికే అర్థమైంది. లేకుంటే మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కనీసం 10 సీట్లయినా వచ్చేవి. దేశవ్యాప్తంగా 'ఇండియా' కూటమికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. కానీ, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి మాత్రం ఆశించిన సీట్లు రాలేదు. రెండు జాతీయ పార్టీలు సరి సమానంగా సీట్లను పంచుకున్నాయి. కేసీఆర్‌ను బలహీనపరిచి బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టాలనే వ్యూహంతో రెండు జాతీయపార్టీలు తమ సిద్ధాంతాలు మరిచిపోతున్నాయి. ఇందులో భాగంగానే కొందరు ఎమ్మెల్యేలు, నాయకులను చేర్చుకుంటూ కార్యకర్తల్లో ఆందోళన పుట్టిస్తున్నారు. పెద్ద పెద్ద పదవులనుభవించిన వాళ్లు సైతం కేసీఆర్‌ను మోసం చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. అది వారి విజ్ఞతకే వదిలివేయాలి. కానీ, నాయకులు పార్టీలు మారినంత మాత్రాన ప్రజలు, కార్యకర్తలు వారి వెంట వెళ్తారనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో, రాష్ట్ర పునర్నిర్మాణ దశలో కేసీఆర్ లక్షలాది మంది కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నాయి. కానీ, కేసీఆర్‌ను బదనాం చేసి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి ఆ పార్టీని అస్థిరపరచాలనే కుట్రలు కాంగ్రెస్ పార్టీ పన్నుతున్నది. కానీ, బీఆర్ఎస్‌ను కాపాడుకోవటం ఇప్పుడు కేసీఆర్ కంటే తెలంగాణ ప్రజలకే అవసరం. ఎందుకంటే తెలంగాణ ప్రజల పక్షాన పోరాడేది, తెలంగాణ ప్రయోజనాలు కాపాడేది ఒక్క బీఆర్ఎస్ మాత్రమే. బీఆర్ఎస్‌కు మొన్నటి ఓటమి ఒక్క స్పీడ్ బ్రేకర్ వంటిది మాత్రమే. ఇన్నేండ్ల ప్రస్థానంలో బీఆర్ఎస్ ఎన్నో ఒడిదుడుకులను చూసింది. రెట్టించిన వేగంతో మళ్లీ పైకి లేచింది కూడా. ఇప్పుడు కూడా అంతే. ఇప్పుడు బీఆర్ఎస్ చేయవలసిందల్లా ఒక్కటే. ఇన్నేండ్లలో ఆర్థికంగా చితికిపోయి, అవకాశాలు రాక ఉన్న నిఖార్సయిన, నిజమైన ఉద్యమ కార్యకర్తలకు బలాన్నిచ్చి వారికి మేమున్నామనే భరోసా ఇవ్వాలి.

లేఖలు

సాధారణ బదిలీలు చేపట్టాలె

సాధారణ బదిలీలు చేపట్టి ఉద్యోగుల ఇబ్బందులు తొలగిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఆరు నెలలైంది. అయినా, ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చలేక ఆపసోపాలు పడుతున్నది. ఏటా మే నెలలో జరగాల్సిన సాధారణ బదిలీలు 2018లో జరుగగా, ఆ తర్వాత ఇప్పటివరకు మళ్లీ జరగలేదు. మారుమూల ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ, కుటుంబాలకు దూరంగా ఉంటున్న ఉద్యోగులు సాధారణ బదిలీలు ఎప్పుడెప్పుడు జరుగుతాయా అని కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బదిలీలు చేపడుతుందని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురైంది. బదిలీలకు ఎన్నికల కోడ్ అంశాన్ని సాకుగా చూపెట్టిన కాంగ్రెస్ పాలకులు కోడ్ ముగిసిన తర్వాత కూడా ఆ దిశగా ఆలోచనలు చేయడం లేదు. ఒకవైపు పిల్లలకు పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో పిల్లల బడి ఫీజులు కట్టిన తర్వాత బదిలీలు జరిగితే ఎట్లా అనే సందిగ్ధంలో ఉద్యోగులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బదిలీలపై దృష్టి సారించి, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చాలి.

- ఏవీ రమణ, హన్మకొండ

కార్యకర్తలకు న్యాయం చేయాలె!

పార్టీ గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలను, నాయకులను గుర్తించి వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్నది. ప్రభుత్వం త్వరలో నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్న నేపథ్యంలో ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బుకు లొంగిపోయి నామినేటెడ్ పదవులను అనర్హులకు కట్టబెడితే కరడుగట్టిన కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు తీరని అన్యాయం జరుగుతుంది. మొన్నటివరకు కాంగ్రెస్ కండువా వేసుకోవడానికి కూడా ఇష్టపడని కొందరు పార్టీ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే, ఎంపీల పంచన కొందరు చేరుతున్నారు. ఇదిలా ఉంటే కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు తమకు తెలిసిన నాయకులకో, లేక బంధువులకో నామినేటెడ్ పదవులను సిఫారసు చేస్తున్నారు. కాబట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజానిజాలను తెలుసుకోవాలి. క్రియాశీల కార్యకర్తలకు, నాయకులకే నామినేటెడ్ పదవులు ఇవ్వాలి. గెలుపు కోసం కృషిచేసిన కార్యకర్తలకే ఉన్నతస్థానం కల్పించాలి.

- ఇందిరా ప్రియదర్శిని

బీజేపీకి మోకరిల్లిన కాంగ్రెస్